క్లుప్తంగా

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

బి.కొత్తకోట: స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న తరగతుల్లో సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకాధికారి విశ్వలత శుక్రవారం తెలిపారు. 2025–16 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, ఏడో తరగతిలో మూడు, 8వ తరగతిలో రెండు, 9వ తరగతిలో నాలుగు, 10వ తరగతిలో 9 సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు నేటి నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఎండలతో జాగ్రత్త



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రామసముద్రం: వేసవి ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని రామసముద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా తెలిపారు. శుక్రవారం కుదురుచీమన పల్లి పంచాయతీ గుంతయంబాడి ప్రభుత్వ పాఠశాలలో 104వైద్య సేవలు నిర్వహించారు. ప్రజలకు వివిధ రకాల పరీక్షలు చేసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ఎండలకు ఎక్కువగా తిరగరాదని, ప్రతి ఒక్కరు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సుగుణమ్మ, ఆశా కార్యకర్తలు రాధమ్మ, మంజుల పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రం



మైనార్టీ నాయకులతో నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో నిష్ఠతో నెలంతా దీక్షలు చేస్తారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణం జగన్‌కాలనీలోని అమీనా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో తాఖ్‌రాత్‌లు ప్రారంభం కావడంతో మతగురువు ధార్మికోపన్యాసం చేశారు. స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎ.కరీముల్లా, నాయకులు మొహమ్మద్ యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గౌతమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి

మదనపల్లె : బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్‌ను పట్టణంలోని ప్రజాసంఘాలు, వివిధ రాజకీయపార్టీల నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్, లారీ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జింకాచలపతి మాట్లాడుతూ బందెల గౌతమ్ ప్రజా ఉద్యమాల్లో భాగంగా అనేక పోరాటాలు చేశారని, మదనపల్లె జిల్లా కోసం ఉద్యమాన్ని ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు.

24న బస్టాండు గేటు వేలం

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు బస్టాండు గేటు వేలం పాట జరుగుతుందని సర్పంచ్ నీలూఫర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.50వేలు డిపాజిట్లు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ నోటిని శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని దంతవైద్యురాలు డాక్టర్ సుమలత తెలిపారు. శుక్రవారం సీహెచ్‌సీలో ప్రపంచ నోటి సంరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలు, చిగుళ్లు,నాలుక శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేకుంటే దీని పర్యావసానం దేహంపై పడుతుందన్నారు. దీంతో మధుమేహం, క్యాన్సర్ వంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు విక్రాంత్‌రెడ్డి, అమరసింహరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

మదనపల్లె : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్. కోటేశ్వరి వైద్యసిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలోని వైద్యులందరూ మెడికల్ కాలేజీ పీపీపీ విధానంలోకి తెస్తున్నందున బదిలీపై వెళ్లిపోయారన్నారు. మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిని మెడికల్ కాలేజీ నుంచి మినహాయించి యథావిధిగా జిల్లా ఆస్పత్రిగానే నడపాలని ముఖ్యమంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదించామని తెలిపారు.

గ్రాసం కరువు.. పోషణ బరువు

- పాల దిగుబడిపై ప్రభావం
- కొండెక్కిన పశుగ్రాసం ధరలు
- వరిగడ్డి, వేరుశనగ పొట్టుకు డిమాండ్



ట్రాక్టర్లలో ఎండుగడ్డిని తరలిస్తున్న రైతులు

గుర్రంకొండ: గ్రాసం కొరతతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. భగ్గుమంటున్న గడ్డి ధరలు రైతులకు మోయలేని భారంగా మారాయి. ప్రస్తుతం వరిగడ్డి కిలో రూ.8 నుంచి రూ.12 వరకు ధరలు పలుకుతున్నాయి. వేరుశనగ పొట్టు లోడు రూ. 20 వేలు నుంచి రూ.25 వేలు వరకు పలుకుతున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల పాడి ఆవులకు ప్రతి రోజు 1,188.5 టన్నుల గడ్డి అవసరం ఉంది. పాలపై వచ్చే ఆదాయం సగ భాగం పశుగ్రాసం కొనడానికే సరిపోతుండడంతో పాడిరైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

వేధిస్తున్న పశుగ్రాసం కొరత

ఐదేళ్లుగా పాడి ఆవులకు గడ్డి కొరత రాలేదు. ఎక్కడ చూసినా పుష్కలంగా గడ్డి లభించేది. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవలేదు. చెరువులు, బావులు అండుగంటిపోయాయి. దీంతో అరకొరగా పశుగ్రాసం సాగు చేశారు. అంతేకాకుండా కొండలు, గుట్టలు కాలిబూడిదవుతున్నాయి. దీంతో పాడి రైతులు ఇతర జిల్లాల నుంచి వరిగడ్డిని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రోజుకు రూ.1.42 కోట్ల ఖర్చు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని పాడి రైతులు పశుగ్రాసం కోసం ప్రతిరోజు రూ. 1.42 కోట్ల మేరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ట్రాక్టర్లు, లారీల్లో లోడ్ల కింద జమ కట్టి గడ్డిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం రోల్స్ రూపంలో ఎండుగట్టిని బయట ప్రాంతాల నుంచి వ్యాపారులు తీసుకొచ్చి నియోజకవర్గంలో విక్రయిస్తున్నారు. ఒకరోల్‌లో 25 కిలోల మేరకు గడ్డి ఉంటుంది. ఒకరోల్ రూ. 180 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. దీనికి తోడు మొక్కజొన్న, జొన్న పచ్చిగడ్డి, ఉలవపొట్టు, వేరుశనగ పొట్టును పాడిరైతులు కొనుగోలు చేస్తున్నారు. రోజుకు పాడి ఆవుకు రూ. 100 నుంచి రూ.150 వరకు పశుగ్రాసం కోసం ఖర్చు చేయాల్సివస్తోందని పాడి రైతులు చెబుతున్నారు.

భారంగా పశుపోషణ

రోజురోజుకు పశుపోషణ భారంగా మారుతోందని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురవకపోవడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. దీంతో బ్రోకర్లు గడ్డి ధరలు విపరీతంగా పెంచేశారు. పచ్చిగడ్డికి తోడుగా ఎండుగడ్డిని వినియోగించడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందని రైతుల నమ్మకం. దీంతో పచ్చిగడ్డి ఉన్నా ఎండుగడ్డిని కోనేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ధరలు మండిపోతున్నాయి



ప్రస్తుతం వరిగడ్డి ధరలు భగ్గుమంటుంటాయి. దళారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారు. పశుపోషణ భారంగా మారింది. మొక్కజొన్నలు, జొన్నలు, వేరుశనగ పొట్టు ధరలూ ఆకాశన్నంటుతున్నాయి. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా వస్తోంది. – రమణ, పాడిరైతు, కొత్తపల్లె

ప్రతిపాదనలు పంపాం

ప్రస్తుతం పాడిరైతులకు అవసరమైన గడ్డిని సబ్సిడీపై అందించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వచ్చేనెలలో 50 శాతం సబ్సిడీపై పాడిరైతులకు గడ్డి సరఫరా చేసేందుకు సన్నాహాలు చేసుకొంటున్నాం. మొక్క జొన్న విత్తనాలు ప్రస్తుతం సబ్సిడీపై ఇచ్చేందు సిద్ధంగా ఉంచాం. – సునీల్, పశువైద్యాధికారి, గుర్రంకొండ

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

పీలేరురూరల్ : పంట సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఎస్‌వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పి. కార్తీక్‌రెడ్డి, డాక్టర్ ఎం. ప్రదీప్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ హరిజనవాడలో రైతులకు మందుల పిచికారిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సస్యరక్షణ మందుల పిచికారి పద్ధతులు, సురక్షిత వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు కళ్లజోడు, మాస్కులు, చేతి తొడుగులు, వస్త్రాలు ఏ విధంగా ధరించాలి, ఎలా వినియోగించాలి ప్రదర్శన ద్వారా తెలియజేశారు. 30 మంది రైతులకు పిచికారి సురక్షిత కిట్లను అందజేశారు. కళ్లజోడు, మాస్కులు, చేతు తొడుగులు కల్గిన కిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవో రమాదేవి, ఏఈవోలు జ్యోత్స్న, జహీర్, ఎంపీటీసీ ఈశ్వరయ్య, బి.డి. నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న జేపీ చౌదరి

కురబలకోట: విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జేపీ చౌదరి పిలుపు నిచ్చారు. కేంద్ర సూక్ష్మ,చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ సహకారంతో అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే నేషనల్ ఐపీ (మేధో సంపత్తి) యాత్ర ఇన్నోవేషన్ కార్యక్రమం శుక్రవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశంలో ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు మారు మూల ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఏదేశమైనా ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించాలంటే స్థానిక ఉత్పత్తుల వాడకంతో పాటు వారి ఎగుమతుల ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేఎల్ఎస్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ పాల్గొన్నారు.

22ఏ నిషేధిత జాబితా భూమిలో నిర్మాణాలు



భవన యజమానికి నోటీసు అందిస్తున్న పంచాయతీ సెక్రటరీ

మదనపల్లె : మండలంలోని వలసపల్లె పంచాయతీ 22ఏ నిషేధిత జాబితా భూమిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై పంచాయతీ అధికారులు శుక్రవారం నోటీసులు అందించారు. వలసపల్లె పంచాయతీ నవోదయ కాలనీ, బోయకొండ ఆర్చికి సమీపంలోని సర్వే నంబర్ 772/5లోని 22ఏ భూమిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని హెచ్చరించారు. పంచాయతీ సెక్రటరీ అలివేలు, భవన యజమాని సి.రామనాథరెడ్డికి నోటీసు అందించారు. నిర్మాణం చేస్తున్న స్థలం 300 చదరపు మీటర్లకు పైగా ఉన్నందున పీకేఎం-ఉడాలో అనుమతి పొంది తదుపరి నిర్మాణాలు చేయాల్సిందిగా తెలిపారు. వీఆర్వో శ్రీనివాసులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



హ్యాండ్‌బాల్ పోటీలో గెలుపొందిన నెల్లూరు ఎన్‌బీకేఆర్ మహిళా జట్టు

కలికిరి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య అన్నారు. కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 12వ జేఎన్టీయూ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ మీట్ 2కే 25ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని, క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమన్నారు. క్రీడలలో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఈ యూనివర్శిటి అంతర్ కళాశాలల పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంస పత్రాలు అందజేస్తామని తెలిపారు. శుక్రవారం షటిల్(సింగిల్స్, మెన్) నంద్యాల, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల, హ్యాండ్ బాల్ మహిళా విభాగంలో నెల్లూరు, ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, ఖోఖో బాలురు విభాగంలో కలికిరి జేఎన్టీయూ, వాలీబాల్ బాలికల విభాగంలో మదనపల్లి మిట్స్, తిరుపతి ఎస్వీసీఈ కళాశాలల టీంలు సెమీస్‌కు అర్హత సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, పీడీలు పాల్గొన్నారు.

ఘనంగా శయనోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రామసముద్రం: మండలంలోని చెంబకూరులో వెలసిన గట్టు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా శనివారం శయనోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే పలురకాల పుష్పలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెలుగు పాఠశాలలో డౌన్ సిండ్రోమ్ డే



డౌన్ సిండ్రోమ్ డేలో వెలుగు సిబ్బంది, చిన్నారులు

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం డౌన్ సిండ్రోమ్ డే కార్యక్రమం నిర్వహించారు. డౌన్‌సిండ్రోమ్ గల చిన్నారి జ్యోతికిరణ్ తల్లి రాధమ్మ ఈ వైకల్యం లక్షణాలు, రక్తపరీక్షలను, నిర్మూలనకు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రజుమంలో వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనా కుమారి పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు సత్కారం



సత్కారం అందుకున్న బదిలీ పోలీసులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ బదిలీ అయిన ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను శుక్రవారం సీఐ జీవన్ గంగనాధ్ బాబు ఘనంగా సత్కరించారు. ఏఎస్ఐలు బొజ్జినాయక్ గుర్రంకొండకు, ఎం.నరసింహులు నాయక్ కేవీపల్లికి బదిలీ అయ్యారు. హెడ్‌కానిస్టేబుళ్లు బి.రెడ్డెప్పనాయక్, ఈ.నాగరాజగౌడ్ మదనపల్లె వన్‌టౌన్‌కు, ఎం,రవీంద్రనాయక్ వాల్మీకిపురంకు, కానిస్టేబుళ్లు జే,శేఖర్ మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌కు, ఈ.నాగేంద్ర వాల్మీకిపురంకు, ఆర్.వెంకటరమణ నిమ్మనపల్లెకు, ఎం.లక్ష్మీనారాయణ మదనపల్లె టూటౌన్‌కు, ఎస్.సురేంద్ర కేవీపల్లెకు, బి.మారుతి ప్రసాద్ మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీరందరికి వీడ్కోలు పలుకుతూ సీఐ శాలువలు, పూలమాలలతో సత్కరించారు. కాగా బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా ములకలచెరువు నుంచి ఏఎస్ఐ భాస్కర్‌నాయక్, మదనపల్లె వన్‌టౌన్ నుంచి ఎస్.కరీముల్లా, హెడ్ కానిస్టేబుళ్లు మదనపల్లె తాలూకా నుంచి బి.విశ్వనాధరెడ్డి, వాయల్పాడు నుంచి ఎస్ఎం.అలీఖాన్, మదనపల్లె టూటౌన్ నుంచి డీజీ.రామమూర్తి, కానిస్టేబుళ్లు మదనపల్లె టూటౌన్ నుంచి సీ.హేమంత్, మదనపల్లె వన్‌టౌన్ నుంచి జి.ఆనంద, నిమ్మనపల్లె నుంచి బి.రామచంద్ర, మదనపల్లె టూటౌన్ నుంచి ఎస్.ఇర్ఫాన్ అలీని నియమించారు.

రామసముద్రం: నిక మండల పోలీస్‌స్టేషన్ లో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్‌లను ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. నాలుగు ఐదు సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తూ బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్స్ చంద్రరాజు, శాంతకుమారి, హరిప్రసాద్ రెడ్డి, పార్థసారధిలను దుశ్శాలువాతో సన్మానించారు. ఎఎస్ఐ హిమాచలపతి, లోకేష్, సురేంద్ర పాల్గొన్నారు.

127 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

మదనపల్లె: మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్లో 127 మంది సిబ్బంది బదిలీ అయినట్లు డి.ఎస్.పి దర్బార్ కొండయ్య నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డివిజన్లోని 11 పోలీస్ స్టేషన్లలో ఏఎస్ఐ లు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లు 127 బదిలీ కాగా, వారి స్థానాల్లో 124 మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. పట్టణంలోని తాలూకా పోలీస్ స్టేషన్లో 11 మంది బదిలీ కాగా 12 మంది విధుల్లో చేరారని, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 28 మంది బదిలీ కాగా 24 మంది విధులలో చేరారని, టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో 28 మంది బదిలీ కాగా 30 మంది విధుల్లో చేరారని తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

కలికిరి: ఆటో బోల్తా పడి నలుగురు కూలీలు గాయపడిన ఘటన శుక్రవారం కలికిరి మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని పత్తేగడ పంచాయతీ గువ్వలతోపు వడ్డిపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు గువ్వలతోపు వడ్డిపల్లి నుంచి పని కోసం ఆటోలో వెళుతుండగా కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ లోకేష్, కూలీలు గంగులమ్మ, వెంకటలక్ష్మి, సరస్వతికి తీవ్రగాయాలు కాగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం నలుగురిని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పెద్దతిప్పసముద్రం: పండుగలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని, వాటిని కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని మదనపల్లి డీఎస్పీ కొండయ్య నాయుడు సూచించారు. ముందస్తుగా పెద్దతిప్పసముద్రం మండల ప్రజలందరికీ రంజాన్, గంగ జాతర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం డీఎస్పీ, సీఐ లక్ష్మన్న, ఎస్ఐ హరిహర ప్రసాద్ మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ అధికారులకు తెలపాలని, సమస్య పరిష్కరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ పవన్‌కుమార్

కేవీపల్లె : చేయి చేయి కలిపి క్షయవ్యాధిని నిర్మూలిద్దామని గ్యారంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావనిగౌరి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పవన్ కుమార్ పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉంటే సమీపంలోని పీహెచ్‌సీలో ఉచితంగా గళ్ల పరీక్ష చేపించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన రోగికి ఉచిత చికిత్స తోపాటు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ. వెయ్యి చొప్పున ఆరు నెలలపాటు రోగి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం.. ఆరోగ్యానికి సహకారం



కేవీపల్లె : మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్



పీలేరు : మాట్లాడుతున్న పీడీ రమాదేవి



బి. కొత్తకోట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీడీపీఓ

కేవీపల్లె : పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరి అని అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో రోజు పోషణ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు ఆటల ద్వారా, ప్రాజెక్టుల ద్వారా విద్య నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సామర్థ్యాభివృద్ధి పెంచుకోవాలి

పీలేరు : అంగన్‌వాడీ కార్యకర్తలు సామర్థ్యాభివృద్ధి పెంచుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం రెండోరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సుశిక్షితులైన కార్యకర్తలతో అభ్యాస కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందన్నారు. 0–6 మధ్య వయస్సు పిల్లల్లో భౌతిక, మేధో, ప్రారంభభాష, సామాజిక భావోద్వేగం , సాంస్కృతిక సౌకర్యాభివృద్ధి, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం మెరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కయ్య, ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు పోషణతో విద్య

బి.కొత్తకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషణతో పాటు విద్యను అందిస్తున్నామని బి.కొత్తకోట ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ సుజాత అన్నారు. శుక్రవారం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలన్నింటినీ పటిష్టంగా నిర్వహించాలని కోరారు. చైల్డ్‌హుడ్ కేర్, ఏకో, నైపుణ్యత, విద్యలో భాగంగా పిల్లలకు ఇష్టమైన విధంగా విద్యను బోధించాలని సూచించారు. సూపర్‌వైజర్లు హిజాద్ ప్యారీ, గౌరీదేవి, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈకేవైసీ పెండింగ్ లిస్ట్ పూర్తిచేయాలి

మదనపల్లె : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కార్డుదారులు సంబంధిత రేషన్ దుకాణాల్లో డీలర్ల వద్ద తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. సివిల్ సప్లయిస్ డీటీ ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్‌డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనుంజయులు మాట్లాడుతూ మండలంలో 19,120 మంది కార్డుదారులు ఈకేవైసీ పెండింగ్ ఉన్నారు. దీనికి సంబంధించి షాపులవారీగా వివరాలను రేషన్‌డీలర్లకు అందించామన్నారు. మండలంలోని పెండింగ్ ఈకేవైసీ లిస్టును, రేషన్‌షాపు డీలర్లు ఈనెల 25, 26 తేదీల్లో పూర్తిచేయాలన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఈకేవైసీ చేయాల్సిన అవసరం లేదని, మిగిలిన వారందరికీ ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. గతంలో ఈకేవైసీ చేసుకున్న వారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని, పెండింగ్ లిస్ట్‌లోని లబ్ధిదారులు మాత్రమే చేయించుకోవాలని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న కార్యదర్శులు

నిమ్మనపల్లె: పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని కోరుతూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను వివరించారు. తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు రోజువారి విధులతో పాటు, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా వివిధ రకాల సర్వేలైన మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిసే సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే, హౌస్ హోల్డ్ ట్యాగింగ్, పి4 సర్వే, డెత్ రెటిఫికేషన్ సర్వేలు చేపడుతున్నారన్నారు. సర్వేల కారణంగా పంచాయతీ కార్యదర్శులు అధిక పని భారంతో, పరిపాలన అభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేక పోతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, వెంకటరమణారెడ్డి, శ్రీనాథ్, రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

పీలేరురూరల్ : విద్యార్థులు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఎంజేఆర్ కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు లింకెడ్ ఇన్ ప్రొఫైల్స్ క్రియేటివ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫేస్ ప్రెప్ సంస్థ అసోసియేట్ టెక్నికల్ ట్రినర్ దివ్య, శ్రీదేవి మాట్లాడుతూ లింకెడ్ ఇన్ ప్రొఫైల్స్ క్రియేటివ్‌పై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎన్.వి.ఎన్. రావు, తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ లేకుండా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు

పెద్దమండ్యం: వ్యవసాయానికి సరఫరా చేస్తున్న 9 గంటల విద్యుత్ లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా ఉండేందుకు సబ్‌స్టేషన్‌లలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మండలంలోని తురకపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్, ముసలికుంట సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎస్ఈ మాట్లాడుతూ వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏడీ సురేంద్రనాయక్, ఏఈ రామ్మూర్తినాయక్, ఎల్ఐ రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.